క్లుప్తంగా...

నేడు పట్టణ ప్రగతి ఉత్సవాలు

మణికొండ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పట్టణ ప్రగతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్‌లు ఫల్గుణ్‌కుమార్, సత్యబాబులు తెలిపారు. ఉదయం పట్టణాలలో మున్సిపాలిటీ వాహనాలతో ర్యాలీలు, అనంతరం మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కులో, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశాలను నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఆయా సమావేశాలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరవుతారని వారు వివరించారు.

ధర్మగిరిలో అన్నదానం


ధర్మగిరి ఆలయంలో చేపట్టిన అన్నదానం

శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు హారతి పల్లకీ సేవ, హోమం, అభిషేకం చేపట్టారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు బాబాను దర్శించుకున్నారు. అన్నదాన మండపంలో సుమారు వేయిమంది భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వార్డు కార్యాలయాల్లో సమస్యల పరిష్కారం

వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య


వెస్ట్ జోనల్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశం

గచ్చిబౌలి: డివిజన్లలో నెలకొన్న సమస్యలను ఇకపై వార్డు కార్యాలయాల్లోనే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య పేర్కొన్నారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనతో ప్రజల వద్దకు పాలన అనే నినాదంతో వార్డు కార్యాలయాల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు 10 విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ట్రాన్స్ కో తదితర విభాగాల అధికారులు వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉండనున్నారు. వార్డు స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ జాయింట్ సీపీ మల్లారెడ్డి, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, పూజిత గౌడ్, సింధూ రెడ్డి, ఉప కమిషనర్ వెంకన్న, సుధాంష్, రమేష్ , ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌కు సన్మానం ఉంటుంది. అనంతరం 'టు వర్డ్స్ ఏ ప్రొగ్రెసివ్ లైఫ్' అనే అంశంపై బి.కె.కుల్‌దీప్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. తదనంతరం యోగాసనాలపై సెలెబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ నిఖీ సింగ్ అవగాహన కల్పిస్తారు.

యానిమల్ హెల్త్ వెట్ క్లినిక్ ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన యానిమల్ హెల్త్ వెట్ క్లినిక్‌ను చేవెళ్ళ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కల సంరక్షణ కోసం క్లీనిక్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్త్ వెట్ క్లినిక్ ఎండీ డాక్టర్ రాఘవేందర్, డా. రంజిత్ కుమార్, డా.లహరి, బీఆర్ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, శ్రీను పటేల్ పాల్గొన్నారు.

సరోజినిదేవి కంటి ఆస్పత్రి ఉద్యోగికి ఉత్తమ సేవా అవార్డు

గోల్కొండ: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని సరోజిని దేవి కంటి ఆస్పత్రి కార్యాలయ ఆఫీస్ అసిస్టెంట్ శివ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ వారు ఆయనకు ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా సరోజినిదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డాక్టర్ రాజలింగం, ఆర్ఎంఓ నజాబి తదితరులు ఆయనను అభినందించారు.

మణికొండ అభివృద్ధికి అంతర్జాతీయ ప్రణాళిక

- జర్మనీకి చెందిన సంస్థ సహకారం
- దేశంలో ఆరు పట్టణాలకు వారి సేవలు
- రాష్ట్రంలో మణికొండ మున్సిపాలిటీ ఎంపిక
- పలు రంగాలపై ప్రణాళికల తయారు


గిజ్ ఎన్‌జీఓ సంస్థ సమావేశంలో పాల్గొన్న సంస్థ, మున్సిపాలిటీ ప్రతినిధులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ ప్రజల అవసరాలు, వాటిని తీర్చేందుకు చేపట్టాల్సిన చర్యలు, పట్టణ సుదరీకరణ, ట్రాఫిక్, శానిటేషన్ తదితర సమస్యల పరిష్కారానికి ఓ అంతర్జాతీయ సంస్థ రాబోయే రోజుల్లో ప్రణాళికను సిద్ధం చేయనుంది. దేశంలో ఆరు రాష్ట్రాలలో ఆరు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఎంపిక చేయగా మన రాష్ట్రంలో వారు మణికొండ మున్సిపాలిటీని ఎంపిక చేసుకున్నారు. అందుకు అవసరమైన సూచనలు, సలహాలను తెలుసుకునేందుకు గురువారం మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, అధికారులతో మొదటి సమావేశం నిర్వహించారు. జర్మనీ ప్రభుత్వం వారి గిజ్ ఎన్‌జీఓ సంస్థ తరపున అర్బన్ చాలెంజ్ లాబ్ అనే అంశంపై అనేక పట్టణాలు, కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల పరిధిలో నివసిస్తున్న ప్రజల అవసరాలు, సమస్యలు, వాటి పరిష్కారాలపై నిత్యం అధ్యయనం చేస్తుంది. వారి అధ్యయనంలో వచ్చిన పరిష్కారాలను ఓ నివేదిక రూపంలో తయారు చేసి సదరు మున్సిపాలిటీలకు అందజేస్తుంది. వాటిని అమలు చేస్తే పట్టణ రూపు రేఖలు మారటంతో పాటు ప్రజల సమస్యలు సునాయాసంగా పరిష్కారం లభిస్తాయని వారి నమ్మకం. గురువారం సదరు సంస్థ నగరంలోని షెర్టాన్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ కె. ఫాల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, కౌన్సిలర్‌లు, సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ వేణుగోపాల్, జాతీయ ప్రతినిధి టెరేసా కర్చెర్‌లతో పాటు పలు రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనేక రంగాలలో అధ్యయనం..

గిజ్ ఎన్‌జీఓ సంస్థ రాబోయే రోజుల్లో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శానిటేషన్, డ్రైనేజీ, ట్రాఫిక్, పొల్యుషన్, ఆస్తుల వృద్ధి, ఆటస్థలాల డిజైన్ చేసుకోవడం లాంటి విషయాలపై కూలంకషంగా అధ్యయనం చేయనుంది. ఆయా సమస్యలు ప్రజలకు కలిగిస్తున్న ఇబ్బందులు వాటిని ఎలా పరిష్కరించాలనే మార్గాలపై వారి అన్వేషణ కొనసాగుతుంది. వాటి పరిష్కారానికి మార్గదర్శకాలతో కూడిన ప్రణాళికను సిద్ధం చేసి మున్సిపాలిటీకి అందజేస్తారు.

ఆరు రాష్ట్రాలలో.. ఆరు పట్టణాలు...

గిజ్ ఎన్‌జీఓ సంస్థ మన దేశంలోని ఆరు రాష్ట్రాల్లో ఆరు మున్సిపాలిటీలలో ఈ సంవత్సరం పనిచేయనుంది. అందులో మన రాష్ట్రంలో మణికొండ మున్సిపాలిటీ, తమిళనాడు రాష్ట్రంలో కోయంబత్తూరు, ఒడిస్సాలో భువనేశ్వర్, కేరళలో కొచ్చి, కర్ణాటకలో బెంగళూరు, అస్సాంలో గోహటి రాష్ట్రాలలో వారి అధ్యయనం, ప్రణాళికలను తయారు చేస్తుంది. సదరు సంస్థకు రాష్ట్రానికి ఒక ప్రతినిధి, దేశానికి ఒక ప్రతినిధి ఉండి అంతర్జాతీయంగా ఆయా సమస్యల పరిష్కారానికి అనేక మంది నిపుణులు పనిచేయనున్నారని మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు.

గతానికి భిన్నంగా రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


కవ్వగూడలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రాష్ట్రంలో గతానికి భిన్నంగా అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 15వ రోజు గురువారం మండలంలోని కవ్వగూడ, పెద్ద గోల్కొండలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ హరీష్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆశయం మేరకు తండాలను పంచాయతీలుగా మార్చడంతో పాటు భారీగా నిధులు ఇచ్చి అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రతినెలా పంచాయతీలకు రూ.258 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. బాగా పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కవ్వగూడలో చెత్త సేకరణ బాగా జరుగుతుందని ఇక్కడ తడి చెత్తతో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టుతో పంచాయతీ అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి స్థానికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలన్నారు. కవ్వగూడలో పంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన, సీసీ కెమెరాల ప్రారంభోత్సవం, పెద్ద గోల్కొండలో పంచాయతీ నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టరు ప్రతీక్‌జైన్, డీసీపీ నారాయణ రెడ్డి, సర్పంచు రమేష్, లక్ష్మయ్య, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీటీసీ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పుస్తక ప్రదర్శన


పుస్తక ప్రదర్శనని తిలకిస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయలంలోని నాలెడ్జ్ మేనేన్‌మెంట్ సెంటర్ భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) పుస్తక ప్రచురణల విభాగంతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజెమెంట్ ఈ పుస్తక ప్రదర్శనని ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను విశ్వవిద్యాలయం డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ ప్రారంభించారు. ఇందులో వ్యవసాయ, ఉద్యానవన, పశువైద్యం, ఫిషరీస్‌తో పాటు ఇతర వివిధ విభాగాలకు చెందిన పుస్తకాల్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం డీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఎదుగుదలలో పుస్తక పఠనం చాలా ప్రధానమని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఈ పుస్తక ప్రదర్శనని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మికుల పక్షాన పోరాడతాం


వనంపల్లి జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

రాజేంద్రనగర్: ప్రజలు, కార్మికుల పక్షాన నిలపడి వారి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మున్సిపల్ రంగ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యుడు వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఆల్ ఇండియా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన ఆయనను ఏఐటీయూసి రాజేంద్రనగర్ మండల కోశాధికారి రాజు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటూ వారి పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కార్మికులకు దక్కాల్సిన హక్కులకై అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు.

నేడు వార్డు కార్యాలయాల ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఐదు వార్డు కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం ఈ వార్డు కార్యాలయాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు ప్రారంభించనున్నారు. వార్డు కార్యాలయాలకు అధికారులను నియమించి అక్కడ నుంచే పాలన కొనసాగించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్‌కు సంబంధించి వాదేమొహ్మద్ కాలనీలో, శాస్త్రీపురం డివిజన్‌కు తాళ్ల మసీద్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు సంబంధించి టీఎన్‌జీఓస్ కాలనీలోని మోడల్ మార్కెట్‌లో, రాజేంద్రనగర్ డివిజన్‌కు సంబంధించి ఎన్ఐఆర్‌డీ రోడ్డు ప్రాంతంలోని మహిళా బిల్డింగ్, అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సులేమాన్‌నగర్‌కు మహ్మద్ మసూద్ ఉర్ రహమాన్ ఫోన్ నెం: 9989930158, శాస్త్రీపురం డివిజన్‌కు జి.నర్సింగ్‌రావు 9959901775, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు ఎం.జయప్రకాష్ ఫోన్ నెం: 9949347023, రాజేంద్రనగర్ డివిజన్‌కు వై.పద్మావతి ఫోన్ నెం: 7702507310, అత్తాపూర్ డివిజన్‌కు శివానంద్ ఫోన్ నెం: 8106938001లను నియమించారు. శుక్రవారం నుంచి ఆయా డివిజన్‌లకు చెందిన వార్డు కార్యాలయాలను సంప్రదించి సంబంధిత సమస్యల పరిష్కారం పొందాలని ఉపకమిషనర్ జగన్ వెల్లడించారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం


విద్యుత్ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి విద్యుత్ సంస్థ సీజీఆర్‌ఎఫ్ సంస్థను ఏర్పాటు చేసిందని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ జయరాజ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు, బిల్లులకు సంబంధించిన హెచ్చుతగ్గుల సమస్యలు, క్షేత్రస్థాయిలో స్తంభాలు వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గురువారం శివరాంపల్లిలోని డీఈ కార్యాలయం వద్ద జరిగిన సీజీఆర్‌ఎఫ్ కార్యక్రమంలో వినియోగదారుల నుంచి 22 వినతిపత్రాలు అందించినట్లు ఇంజనీర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల పరిస్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్ పర్సన్ ఎస్.జయరాజ్, టెక్నికల్ మెంబర్ బి.లలిత, ఫైనాన్స్ మెంబర్ కె.శోభారాణి, ఇండిపెండెంట్ మెంబర్ జి.గజేందర్, రాజేంద్రనగర్ సర్కిల విద్యుత్ సూపరెంటెండ్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు సత్యనారాయణ, ఈశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి అదృశ్యం

శంషాబాద్: నీళ్ల బాటిల్ కొనుక్కుని వస్తానంటూ కారు దిగిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటన గురువారం వెలుగుచూసింది. నాదర్‌గుల్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుడ్ల రాఘవేందర్‌రావు (50) అతడి భార్య అంజమ్మ ఈనెల 3 మహబూబ్‌నగర్‌కు వెళ్లి అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. శంషాబాద్ పట్టణానికి వచ్చిన తర్వాత బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం సమీపంలో నీళ్ల బాటిల్ కొనుక్కుని వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో గురువారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవతోనే మోక్షం


పేదలకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం


అత్తాపూర్‌లోని ఇస్కాన్ శ్రీకృష్ణ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: మానవ సేవయే మాధవ సేవా అనే సనాతన భారతీయ ఆధ్యాత్మిక సూత్రాన్ని తాను తూచాత ప్పకుండా అనుసరిస్తున్నామని ఇస్కాన్ అత్తాపూర్ ఆలయ మేనేజర్ స్వామి సచ్చినందన్ హరిదాస్ పేర్కొన్నారు. సామాజిక సేవలోనే మోక్షం అనేది తమ విశ్వాసం అని ఆయన తెలిపారు. ఈ సూత్రాన్ని అనుసరించడంలో భాగంగా నిత్యం వెయ్యి మందికి పైగా శ్రీకృష్ణుడి ప్రసాదాన్ని అన్నదానంగా అందజేస్తూ పలువురి ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం ద్వారా ఇప్పటి వరకు 15 లక్షల మందికి పైగా ఆకలి తీర్చామని తెలిపారు. అత్తాపూర్‌లోని ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరంలో గురువారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక శాంతి తమ లక్ష్యమని తెలిపారు. సీక్రెట్ ఆఫ్ సక్సెస్ అనే కార్యక్రమం ద్వారా ప్రతినెలా పలు కార్యక్రమాలను విద్యార్థులకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకముందు కూడా సామాజిక సేవను కొనసాగించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా పెంపొందించి ప్రపంచ శాంతిని కాంతిస్తున్నామని ఆయన వివరించారు.

బుద్వేల్‌లో బొడ్రాయి వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లో బొడ్రాయి వార్షికోత్సవం పూజా కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయిని నెలకొల్పి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అభిషేకం, అనంతరం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా బొడ్రాయితో పాటు పరిసర ప్రాంతాలను వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. బుద్వేల్‌తో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన బస్తీ, కాలనీ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: కాలనీల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనుపటేల్, తిరుమలేష్, గుల్‌మొహర్ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిప్రశాంత్‌నగర్, ఆదిత్యనగర్, జై భారత్‌నగర్, హైదర్‌నగర్ కాలనీల్లో 1 కోటి 93 లక్షల 40 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్, ముదత్యాల భాస్కర్ తదితరులు

గోల్కొండ: రాష్ట్రాన్ని తొమ్మిదేళ్లుగా సుభిక్షంగా సీఎం కేసీఆర్ పాలిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో కార్వాన్‌లోని దర్బార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని అమ్మవార్లను కోరుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు, శాంతి భద్రతలకు తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. జన్మదిన సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పట్లూరి రఘు, దుర్గరాజ్, రమేష్, సంపత్, ఆశిక్ బాబు, సంతోష్, రాజేష్ తదితరులున్నారు.

మున్సిపాలిటీ చెత్త జీహెచ్ఎంసీలో..

- రోడ్డు పక్కనే పారబోస్తున్న వైనం
- చెత్తసేకరణను పట్టించుకోని జల్‌పల్లి మున్సిపాలిటీ
- చెత్త ఎత్తలేక సతమతమవుతున్న జీహెచ్ఎంసీ

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో భౌగోళికంగా ముగిసే ప్రాంతమైన ఎర్రకుంట రహదారి అది. ఆ పక్కనే జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ప్రారంభమవుతుంది. ఇక్కడ ఇప్పటికే పూర్తిస్థాయిలో కలుషితమైన ఎర్రకుంట పక్కనే ఉన్న రోడ్డు ఖాళీగా ఉండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలో నివాసముండే ప్రజలతో పాటు వాణిజ్య దుకాణాలకు చెందిన వారు ప్రతిరోజూ ఇక్కడే టన్నుల కొద్ది చెత్తను పారబోస్తున్నారు. సంబంధిత కాలనీలో చెత్త సేకరణను అక్కడి మున్సిపాలిటీ సరిగా పట్టించుకోకపోవడే దీనికి ప్రధాన కారణమని జీహెచ్ఎంసీ సిబ్బంది వాపోతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఏరియాల్లో చెత్త సేకరణను ఆటోల ద్వారా చేపడుతున్నారు.

వారంలో ఓ సారి..

ఇక్కడ టన్నుల కొద్ది వేస్తున్న చెత్తను వారంలో ఓ మారు లేదా 15 రోజులకోసారి మాత్రమే తీయిస్తున్నారు. దీంతో రోజుల కొద్ది పడి ఉంటున్న ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోనే పాఠశాలలకు రాకపోకలు సాగించే విద్యార్థులు సైతం చెత్తను దాటుకుని పోలేక నిత్యం నరకం చూస్తున్నారు. పక్కనే ఉన్న మున్సిపాలిటీ చెత్త సమస్యను సీరియస్‌గా తీసుకోకపోవడమే దీనికి ప్రధాన కారణమని జీహెచ్ఎంసీ అధికారులు వాపోతున్నారు.

పరిష్కారం ఎలా..

రహదారి ప్రాంతంలో చెత్తను వేసే వారి నుంచి జరిమానా వసూలు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించినా దానిని ఇంతవరకు అమలు చేయడం లేదు. జరిమానాల విధింపుతో పాటు చెత్త సేకరణ సమస్య పరిష్కరించే విధంగా సంబంధిత మున్సిపాలిటీకు కనీసం నోటీసులు కూడా జారీ చేయకుండా తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త సమస్యపై అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాలు